క్లుప్తంగా

ఆధ్యాత్మికవేత్త వెంకన్నబాబు స్వామికి సత్కారం



సత్కారాన్ని అందుకుంటున్న చిన్న వెంకన్నబాబు దంపతులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠాధిపతి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, జ్యోతిష్య బ్రహ్మ డాక్టర్ చిన్న వెంకన్నబాబు మంగళవారం ఘన సత్కారాన్ని అందుకున్నారు. స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి మహా ప్రసాదాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల పండుకు అందజేశారు. అనంతరం జ్ఞాపిక, శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయ న ఆయన మాట్లాడుతూ అమ్మవారి కటాక్షం కోసం భక్తి భావాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల పండు ఆధ్వర్యంలో హిందూ ధర్మపరిరక్షణ నిమిత్తం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పి. సీతయ్య, మజ్జి లక్ష్మీదుర్గాభవాని, బొర్రా నరసింహస్వామి, మాగాపు శ్రీనివాసు, కోమలి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పుణ్యక్షేత్రంలో వైద్య శిబిరం

రాజానగరం: దివంగత నేత, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు 13వ వర్ధంతి సందర్భంగా పుణ్యక్షేత్రం గ్రామంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గుండె వైద్య, స్త్రీల వైద్యం, చిన్న పిల్లల వైద్య, చర్మ వ్యాధులు, మూత్రకోశ వ్యాధులు, నరాలు, కిడ్నీ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరి తిత్తుల వైద్యం, కంటి, దంత వైద్యానికి సంబంధించి ప్రముఖ వైద్యులు పరీక్షలు చేస్తారు. ఇతర వివరాలకు 90145 99859 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కొంతమూరులో మరో చోరీ

29 కాసుల బంగారు నగలు అపహరణ



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో సోమవారం అర్ధరాత్రి మరో చోరీ జరిగింది. 29 కాసుల బంగారు నగలతోపాటు రూ.40 వేలు నగదును కూడా దుండగులు అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించిన స్థానిక సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతమూరు, అగ్రహారం వీధిలో నివాసం ఉంటున్న కడియాల శ్రీకళ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం విజయవాడ వెళ్లారు. దీనిని అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అర్ధరాత్రి సమయంలో ఇంటిలోకి ప్రవేశించి, బీరువాలో దాచిన 29 కాసుల బంగారు నగలను, రూ.40 వేలు నగదును తీసుకుని పరారయ్యారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన వారికి తలుపులు తెరచి ఉండడంతో కంగారుగా లోనికి వెళ్లి చూస్తే చోరీ జరిగిందని గ్రహించారు. పోయిన వస్తువుల విలువ రూ.15 లక్షలు పైబడి ఉంటుందని అంచనా. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ని రప్పించి, నిందితుల ఆనవాళ్ల కోసం పరిశోధిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గ్రామ సభలతో పనుల గుర్తింపు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భారతి

సీతానగరం: మండల గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించడం ద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ ఎం.భారతి అన్నారు. మంగళవారం రఘుదేవపురం, చినకొండేపూడి గ్రామ సచివాలయాల వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్లానింగ్ 2025 – 26 ఫైనల్ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు, స్థానికులకు అవసరమైన పనులు గుర్తించి, ఉపాధిహామీ పథకంలో ఉంచి పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ నాగశేషవేణి మాట్లాడుతూ రఘుదేవపురంలో రూ.2 కోట్ల అంచనాతో 104 పనులు, చినకొండేపూడిలో రూ.1.90 కోట్ల అంచనా విలువలతో 108 పనులు గుర్తించామన్నారు. పంట కాలువ, చెరువుల పూడికతీత, గట్లు పటిష్టపర్చడం, మొక్కలు నాటడం వంటి పనులు, పుంతరోడ్లు, రైతుల పంటపొలాల్లో ఫారమ్ పాండ్స్ (నీటి గుంటలు) వంటి పనులు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి వివిధశాఖాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కైకవోలు పెదపూడి గ్రామాల మధ్య బాడవ ఊట కాలువ వంతెన శిథిలమై మధ్యలో కుంగి ప్రమాదకరంగా ఉన్న వంతెన



రెయిలింగ్ పాడై ప్రమాదాన్ని సూచిస్తున్న పుట్టకొండ వంతెన



పెద్దాడ గండ్రేడు గ్రామాల మధ్య మురుగు కాలువపై అప్రోచ్ జారిపోయి రక్షణ గోడలు శిథిలమై ప్రమాదకరంగా ఉన్న వంతెన

ప్రమాదాలకు వారధి

- శిథిలావస్థకు చేరిన వంతెనలు
- రక్షణ గోడలు, అప్రోచ్‌లు లేక ఇబ్బందులు
- ఆందోళనలో ప్రయాణికులు



పెదపూడి వేట్లపాలెం గ్రామాల మధ్య రోడ్డు, అప్రోచ్ జారిపోతూ రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా ఉన్న వంతెన

పెదపూడి: గ్రామాలో ఉన్న వంతెనలు ప్రమాదకరంగా మారాయి. శిథిలావస్థకు చేరడం, రక్షణ గోడలు లేకపోవడం, అప్రోచ్ సక్రమంగా లేకపోవడం, రోడ్డు కోతకు గురవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని ప్రయాణికులు భాయందోళనలు గురవుతున్నారు. ఈ ప్రమాదకరంగా ఉన్న వంతెనలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. శిథిలస్థితికి చేరిన వంతెనలపై నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయానిస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో పంట, మురికి కాలువలపై ఉన్న వంతెనలకు ఈ దుస్థితి నెలకొంది. అయితే ఈ వంతెలన వద్ద పెద్ద ప్రమాదాలు జరిగితేగాని అధికార, ప్రజా ప్రతినిధులు స్పందించరంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.

శిథిలమైన వంతెనల దుస్థితి ఇలా

అనపర్తి నియోజకవర్గంలోనియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల్లో వంతెనలు శిథిలాస్థితికి చేరాయి. అనపర్తి మండలంలో కొప్పవరం గ్రామంలో నిత్యం వేలా మంది రాకపోకలు సాగించే వంతెన శిథిలమైంది. కుతుకులూరు పులగుర్త గ్రామాల మధ్య ఉన్న వంతెనకు రక్షణగోడ కరవైంది. వెంతన కుంగి శిథిలాస్థితికి చేరడంతో ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణిలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిక్కవోలు మండలంలో పందలపాక కొంకుదురు గ్రామాల మధ్య వంతెన శిథిలమైంది. కొంకుదురులో ఇరుకైన, ప్రమాదాలకు నిలయమైన వంతెన, కొమరిపాలెం గ్రామంలో కాలిబాట వంతెన, దాని పక్కన వంతెన అసంపూర్తిగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

పెదపూడి–వేట్లపాలెం వద్ద..

పెదపూడి, వేట్లపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెదపూడి గ్రామ పరిధిలోని సత్రం సమీపంలో మురుగు కాలువపై ఉన్న వంతెన ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. వంతెన నిర్మించి 12 ఏళ్ల అవుతోంది. ఈ వంతెన అప్రోచ్ జారిపోతు, రెయిలింగ్ పాడై ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాలకు వంతెన వద్ద రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనాలు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోతున్నాయి. ఈ వెంతెన వద్ద ప్రమాదానికి గురై చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.

శహపురంలో...

శహపురం, కైకవోలు గ్రామాల మధ్య వేళంగి, వేట్లపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆడదానిరేవు వద్ద పెద్ద కాలువపై నిర్మించిన వంతెన రిటైనింగ్‌వాల్, అప్రోచ్ జారి, కుంగిపోతూ ప్రమాదకరంగా మారింది.

పుట్టకొండలో..

పుట్టకొండ, కుమారప్రియం గ్రామాల్లో కై కవోలు పంటకాలువపై వంతెన శిథిలస్థితికి చేరింది. ఈ వంతెన బీటలు తీసి, రెయిలింగ్ పాడైపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కైకవోలు–పెదపూడి గ్రామాల వద్ద..

కై కవోలు పెదపూడి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో కైకవోలు సమీపంలో ఉన్న బాడవ ఊటకాలువ(మురుగు కాలువ)పై ఉన్న వంతెన ఏక్షణం కూలిపోతుందోనని ప్రయాణీకులు భయపడుతున్నారు. ఈ వంతెన శిథిలాస్థితికి చేరి సుమారు ఎనిమిదేళ్లవుతోంది. ఈ వంతెన బీటలు తీసి, రెయిలింగ్ పాడై ఉంది. వంతెన మధ్యలో కుంగి ఉంది. వంతెనపై భారీ వాహనం వెళుతుంటే వంతెనపై గల సిమ్మెంట్ దిమ్మ అదరడంతో ఎప్పుడు విరిగిపోతుందోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై కుమారప్రియం, కై కవోలు, పెదపూడి, దోమాడ, కరకుదురు, సంపర, చింతపల్లి, వేండ్ర తదితర గ్రామాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

జి.మామిడాడ–చింతపల్లి మధ్య..

జి.మామిడాడ చింతపల్లి గ్రామాల మధ్య అర్‌అండ్‌బీరోడ్డులో పంట కాలువపై ఉన్న వంతెన అప్రోచ్ జారిపోతు ప్రమాదకరంగా తయారైంది. ఈ వంతెన నిర్మించి సుమారు 15 ఏళ్లవుతోంది. ఏటా సమస్య పెరుగుతోంది.

గోడలు శిథిలమై..

పెద్దాడ గండ్రేడు గ్రామాల మధ్య మురుగు కాలువపై ఉన్న వంతెన నిర్మించి సుమారు 13ఏళ్లు అవుతోంది. ఈ వంతెన రక్షణ గోడలు శిథిలమై, రోడ్డు కోతకు గురవుతు, అప్రాచ్ జారిపోతూ ప్రమాదకరంగా తయారైంది.

చీరల పంపిణీ



పందలపాకలో చీరలు అందిస్తున్న సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పందలపాకలోని 400 మంది కుటుంబాలకు సంతోషి మాత ఆలయం వద్ద చీరలు అందించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా మంగళవారం గ్రామంలోని సూర్యనారాయణరెడ్డి ఫౌండేషన్ అధినేత మాజీ సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యానారాయణరెడ్డి, లక్ష్మీకాంత్ దంపతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి పడాల వెంకటరామారెడ్డి, మాజీ ఉపసర్పంచి పడాల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఆలయం కమిటీ సభ్యులు బొడ్డు శ్రీను, బందారు అప్పారావు, తుమ్మూరి వెంకటరమణ, ముల్లు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి సీఐ శివగణేష్ వీఆర్‌కు బదిలీ

పెదపూడి: అనపర్తి సీఐ శివగణేష్ వేకెన్సీ రిజర్వ్(వీఆర్)కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ డీఐజీ నుంచి ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. అయన అనపర్తి సీఐగా గత ఆరు నెలలుగా పని చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం వీఆర్‌కు పంపించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

మధురపూడి: కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్, డ్వాక్రా ఏపీఎం అంబటి సూరమ్మ మంగళవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను మార్యద పూర్వకంగా కలిశారు. స్థానిక కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని విధి నిర్వాహణపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి ప్రలో భాలకు గురికాకుండా ప్రజా సమస్యల సాధనకు కృషిచేయాలన్నారు. అలాగే ఏపీఎం సూరమ్మ విలేకరులతో మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి డ్వాక్రా ఉపయోగపడుతోందన్నారు. ఇప్పటివరకూ బాధ్యతలు నిర్వహించిన ఎంపీడీఓ నరేషకుమార్ కొత్తపేటకు, డ్వాక్రా ఏపీఎం జయంతిరాజు గోకవరం బదిలీఅయ్యారు.

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి

- కాకినాడ జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు విజయకుమార్



పెదపూడి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయకుమార్

పెదపూడి: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించేలా రైతులకు అవసరమైన సూచనలు సలహాలు అందించడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం దోహదపడుతుందని కాకినాడ జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయకుమార్ రైతులకు వివరించారు. పెదపూడి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ పెట్టుబడి తగ్గించే విధంగా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ సొసైటీ మాజీ అధ్యక్షుడు పుట్టా గంగాధర్ చౌదరి, ఆరుమిల్లి వాసు, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, వ్యవసాయశాఖ అధికారులు ప్రసాద్, సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వరిలో సమగ్ర సస్యరక్షణ పాటించాలి

రంగంపేట: వరిలో సమగ్ర సస్యరక్షణ పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు సూచించారు. రంగంపేట మండలం ముకుందవరం గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె. శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో సార్వా వరి పంటకు ముఖ్యంగా పీఎల్‌ఏ-1100, పీఆర్-126, సంపద స్వర్ణ వంటి రకాలలో ఎండాకు తెగులు సోకిందన్నారు. అధిక నత్రజని వినియోగం, పొటాష్ ఎరువు వాడకపోవడం, సాగునీరు, వర్షపు నీరు ద్వారా తెగులు ఉధృతి కొంతమేర గమనించామన్నారు. తగిన యాజమాన్య పద్ధతులు పాటించి బ్యాక్టీరియా ఎండు తెగులును నివారించుకోవాలన్నారు.

జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ బ్యాక్టీరియా ఎండాకు తెగులు వరిలో కొన్ని రకాలలో గమనించామన్నారు. దీని నివారణకు నత్రజని ఎరువులు వేయడం ఆపివేసి, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోలు చల్లుకోవాలన్నారు. నీటిని తీసివేసి పొలం ఆరబెట్టి తదుపరి నీరు ఇవ్వడం చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే తీవ్రతను తగ్గించడానికి ప్లాంటోమైసిన్ 1.0 గ్రామ్, కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అవసరం బట్టి 7-10 రోజులలో మరో పర్యాయం పై మందు పిచికారీ చేయాలన్నారు.

ప్రస్తుత వాతావరణానికి దోమ వచ్చే అవకాశం ఉన్నందున, పురుగు కనిపించిన మీదట పంట క్రింది భాగం తడిచేటట్టు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ట్రిఫ్లూమిజోపిరమ్ (పెక్సలాన్) 0.48 మిల్లీ లీటరుకు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. డాక్టర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలన్నారు. వచ్చే దాళ్వాకు అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో చేస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమ వివరాలు తెలియజేశారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కె. శ్రీనివాసరావు ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

వచ్చే నెల ‘నన్నయ’లో సాంస్కృతిక వైభవం సదస్సు



బ్రోచర్‌ని విడుదల చేస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నవంబరు 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని మంగళవారం విడుదల చేశారు. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం, సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్ (కాప్స్) విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. దీనికి ఆచార్య కేఏస్ రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ ఎస్.సజనారాజ్ వచ్చేయనున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మౌళిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణకు పరిశోధకులను ఆహ్వానిస్తున్నామన్నారు. అవధానం, దండకం, శతకం, పద్య కవిత్వం వంటి సాహిత్య ప్రక్రియలు, కూచిపూడి, ఆంధ్రనాట్యం, దింసా, గిరిజన నృత్యాలు వంటి జానపద సాంప్రదాయ నృత్యరీతుల ఆవిర్భావం, జానపద కళారూపాలు, బుర్రకథ, హరికథ, తోలు బొమ్మలాట, తొప్పెటగుళ్ల తదితర సాహిత్య జానపద సంస్కృతిక అంశాలపై రచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. వ్యవసాయ, సంస్కృతి, ఆహార అలవాట్లు, వస్త్రరీతులు, శిల్పనిర్మాణ శాస్త్రాలు, క్రీడలు, పండుగలు, ఉత్సవాలు, హస్త కళారూపాలు, జీవన విలువలు, సంస్కరణలు, సేవా భావం, విశ్వబంధు భావన వంటి సాంస్కృతిక అంశాల పై ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణయించిన రుసుం చెల్లించి, ఈనెల 25లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సురేష్, కాప్స్ అధ్యక్షులు, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డి, ఓలేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సహకారంతోనే అభివృద్ధి

బిక్కవోలు: అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే అధికారుల సహకారం అవసరమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.మంగళవారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంచార్జి ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కొంకదురు ఎంపీటీసీ కొంకుదురు పీపీ మాట్లాడుతూ కొంకుదురు గ్రామంలోని బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. ఊలపల్లి ఎంపీటీసీ బందారు శివ మాట్లాడుతూ కరకదురు -రాజమహేంద్రవరం బస్సు ఏ సమయంలో వస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు పరివేక్షణ చేయాలన్నారు. ఎంపీపీ బుద్దాల కన్నారావు మాట్లాడుతూ కెనల్ రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కెనల్ రోడ్డు మరమ్మతులు జరుగుతాయన్నారు. బ్యాంకు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి 8 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. కార్యక్రమంలోని ఇంచార్జి ఎంపీడీవో రత్నకుమార్, వైస్ ఎంపీపీ పెంకె మంగయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల సరస్వతీదేవి సామూహిక పూజలు

రంగంపేట: మండలంలో విజయదశమి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సరస్వతీదేవి జన్మ నక్షత్రం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో సామూహిక ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కోటపాడు సత్యసాయి సేవా సదన్‌లో సాయిమాతను సరస్వతీ మాతగా అలంకరించి విద్యార్థులతో ప్రత్యేక పూజలు చేయిస్తామని సత్య సాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమరనాథ్ తెలిపారు. నాలుగు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో కుంకుమ పూజలు చేస్తామని, శనివారం గ్రామస్తులంతా అమ్మవారికి సారె తెచ్చే కార్యక్రమం ఉంటుందని భక్తులంతా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని ఆయన కోరారు. అలాగే రంగంపేట, వడిశలేరు, ఎస్టీరాజాపురం, ఈలకొలను, జి.దొంతమూరు, వీరంపాలెం, ముకుందవరం, చంద్రేడే, పెదరాయవరం, నల్లమిల్లి తదితర గ్రామాలలో గల దేవీ మంటపాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

జయములివ్వు తల్లీ.. జగజ్జననీ..

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు
- మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

రంగంపేట: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు మండలంలో కనుల పండువగా జరుగుతున్నాయి. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని జయ ములివ్వు తల్లీ జగజ్జననీ అని వేడుకుంటున్నారు. ఆరో రోజైన మంగళవారం రంగంపేటలో దేవీ సెంటర్, స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం అభిషేకాలు అనంతరం కలశస్థాపన, సహస్రనామ కుంకుమార్చనచేసి అమ్మవారిని మహలక్ష్మీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. చక్రపొంగలి, పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు. రూ. 50 నోట్లతో అమ్మవారిని అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాల దారులు ఆలయానికి పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు. మహిళలు భజనలు చేశారు.

చంద్రేడులో..

స్థానిక కాత్యాయనీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని మహలక్ష్మీ దేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు అనంతరం అమ్మవారిని వెండి, బంగారు నగలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. వడపప్పు, చనివిడి, పానకం, పులిహోర నైవేద్యం సమర్పించారు. భక్తులు భారీగా తరలివచ్చి అభిషేకాలను తిలకించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

దొంతమూరులో..

గ్రామంలోని మెయిన్‌రోడ్డులో విజయదుర్గాదేవి 6వ నవరాత్రి మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈలకొలనులో..

గ్రామంలోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు భారీస్థాయిలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాద వితరణ చేశారు.

వడిశలేరులో...

స్థానిక ఏడీబీ రోడ్డు పక్కన కొలువైయున్న విజయ దుర్గా దేవి 15వ దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆరవరోజు మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేపట్టారు. అధిక సంఖ్యలో భవానీ మాలదారులు, భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం తదితర గ్రామాలలో ఆలయాల వద్ద విజయ దశమి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి మండపాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

రాజానగరం: స్థానిక గాంధీ బొమ్మ దిగువ వీధిలో కొలువైవున్న కనకదుర్గ అమ్మవారిని మంగళవారం దనలక్ష్మి అవతారంగా అలంకరించి, పూజలు చేశారు. సుమారు 15 వేలు విలువ చేసే రూ.100, రూ. 200, రూ. 500 కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఉత్సవాల నిర్వాహకులైన సాంబత్తుల కుటుంబానికి చెందిన నలుగురు ఆడపడచులు రూ.1.50 లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని జగన్మాతకు బహూకరించారు. అలాగే మండలం, చక్రద్వారబంధంలోని దేవీ చౌక్‌లో కొలువై ఉన్న దేవి మాతకు ప్రగడ మునీశ్వ్రావు, ధనలక్ష్మి దంపతులు అరకాసు బంగారంతో తయారు చేయించిన చెతమానాలను కానుకగా సమర్పించారు. బుధవారం మూల నక్షత్రం కావడంతో జగన్మాతను సరస్వతీదేవిగా అలంకరించి, పూజలు నిర్వహించనున్నారు.



నాగరత్నం కాలనీ ఆలయంలో మహాలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

పెదపూడి: అనపర్తి గ్రామంలో వీరులమ్మ త్రిశక్తి పీఠంలో శరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.5లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంటుంది. సంపరలోని విజయదుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు.

బిక్కవోలు: దేవీ నవరాత్ర ఉత్సవాల్లో ఆరో రోజు అమ్మవారిని మహాదేవిగా అలంకరించారు. మంగళవారం పందలపాక శ్రీదేవి అమ్మవారి ఆలయంలో, రాజరాజేశ్వరి ఆలయంలో, సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీతానగరం: మండల గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో ఆరో రోజు మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద భక్తులు క్యూకట్టారు. రాపాక పంచాయతీ పరిదిలోగల శ్రీరామనగరం, కాటవరంలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో శ్రీమహాలక్ష్మి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చంద్రేడులో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



వడిశలేరులో మహాలక్ష్మిగా విజయదుర్గమ్మ



రంగంపేటలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



అనపర్తిలో ఆకట్టుకుంటున్న మహాలక్ష్మీదేవి

బీపీటీ నూతన రకం దిగుబడి ఆశాజనకం

- జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ వెంకట నరసింహారావు
- రంగంపేటలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో పంటకోత ప్రయోగం పరిశీలన



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

రంగంపేట: బిపిటి 2841 (బ్లేక్ రైస్) నూతన రకం వరి బాగా పండిందని, ఎండాకు తెగులు, దోమ పోటు ఆశించలేదని, దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రమైన రంగంపేటలో మంగళవారం వారు పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి బీపీటీ 2841 అనే నూతన రకాన్ని ప్రాచుర్యం చేసే ఉద్దేశ్యంతో రంగంపేటకు చెందిన పోతుల పద్మారావుకు ఈ సార్వాలో ఏరువాక కేంద్రం నుంచి విత్తనం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డీఆర్‌సీఏడీఏఎస్ జయరామలక్ష్మిలు రైతులతో క్షేత్ర సందర్శన చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ జిల్లాలో బిపిటి 5204 వంటి సన్న రకాలకు డిమాండ్ ఉందని, బిపిటి 2841 వంటి పోషక విలువలున్న, మార్కెట్ ఉన్న రకాలను ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, ఏఓ కె. శ్రీనివాసరావు, వీఏఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.